క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి విశేషపూజలు



దత్తాత్రేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఈఓ, అర్చకులు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణార్థం శ్రీశైల దేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేషపూజలను దేవస్థానం ఈఓ , అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

పనిప్రదేశంలో జాగ్రత్తలు పాటించాలి



ఉపాధి కూలీలకు సూచనలిస్తున్న ఎంపీడీఓ మేరి

కొత్తపల్లి: ఉపాధి కూలీలు వేసవిని దృష్టిలో ఉంచుకొని పనిప్రదేశంలో జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీఓ మేరి సూచించారు. సిబ్బంది ఇచ్చిన కొలతలమేర పనులు చేయాలన్నారు. గురువారం మండలంలోని ఎదురుపాడు గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఉపాధి కూలీలు పనిని నాలుగు గంటల్లో పూర్తి చేయాలని, మధ్యమధ్యలో విరామం తీసుకోవాలన్నారు. నీటిని బాగా తీసుకోవాలని, పనిప్రదేశంలో నీడను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆమె వెంట ఏపీఓ రాజునాయక్, ఈసీ శ్రీనివాసులు ఉన్నారు.

విద్యార్థులకు నిమ్మరసం పంపిణీ



విద్యార్థులకు నిమ్మరసం అందజేస్తున్న దాత హరిగౌడు

పాములపాడు: మండల కేంద్రంలోని ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూలు పరీక్షా కేంద్రాల్లో 10వ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు గురువారం పాములపాడుకు చెందిన హరిగౌడు నిమ్మరసం పంపిణీ చేశారు. ఎస్ఐ అశోక్ మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి విద్యార్థులకు చల్లని పానీయాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఎండాకాలంలో అలసిన పిల్లలకు నిమ్మరం శక్తి నిస్తుందని అన్నారు. పరీక్షమొదటి రోజు జీఎం రవి మజ్జిగ పంపిణీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మధుసూదన్‌రావు, గని, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

బాపనంతపురంలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ప్రారంభం



104 వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ

ఆత్మకూరు: మండలంలోని బాపనంతపురం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను ఎంపీడీఓ మోహన్‌కుమార్, మండల వైద్యాధికారి పవన్‌కుమార్ గురువారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి పేద ప్రజల సంక్షేమానికి పెద్ద పీట వేశారని, ఇందులో భాగంగా ఇంటి వద్దకే డాక్టర్ పంపించి రోగులకు వైద్య సేవలు అందించేందుకు ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను ప్రారంభించారని చెప్పారు . కార్యక్రమంలో గ్రామసర్పంచ్ దరగయ్య , వైఎస్సార్‌సీపీ నాయకులు రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

'రైతు భరోసాను' సద్వినియోగం చేసుకోండి

ఆత్మకూరు: ఇటీవల రైతులు పొలాలు కొనుగోలు చేసి, పట్టాదారుల పాస్‌పుస్తకాలు పొందిన రైతులు వైఎస్సార్ రైతు భరోసా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆత్మకూరు వ్యవసాయ సలహామండలి చైర్మన్ బైరాపురం షేక్ మహబూబ్‌బాషా తెలిపారు. పట్టణంలోని రైతు భరోసా కేంద్రంలో గురువారం వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఈ ఏడాది రబీలో పలువురు రైతులు నష్టపోయారని, ఖరీఫ్‌లో సాగు చేసే సమయానికి మందులు, ఎరువులు 50 శాతం సబ్సిడీపై మంజూరు చేయాలని తీర్మానించారు. కందులు, మినుములు, మొక్కజొన్న విత్తనాలను 50 శాతం సబ్సిడీపై అందజేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఇబ్రహీం, కలిముల్లా, అబ్దుల్, చిన్నలింగస్వామి, కోట్లయ్య పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

కొత్తపల్లి: పొలాకు చెందిన కొత్త పాసుపుస్తకాలు వచ్చిన రైతులు రైతు భరోసాకు అర్హులని, వారు రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ కె.మహేష్ సూచించారు. స్థానిక కార్యాలయంలో రైతులతో ఆయన మాట్లాడుతూ దరఖాస్తు చేసుకోనేందుకు ఆర్‌బీకేలలో ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభమైందని చెప్పారు. పీఎం కిసాన్ పడని రైతులు ఈనెల 30వ తేదీలోపు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

పాలన చేరువై.. సేవలు మెరుగై

- జిల్లా పునర్విభజనతో ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు
- నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాల ప్రజలకు చేరువైన రెవెన్యూ సేవలు

ఆత్మకూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే గ్రామస్వరాజ్య పాలనకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. ఇందులో భాగంగానే పాలన సౌలభ్యం కోసం నూతన జిల్లాలు, నూతన రెవెన్యూ డివిజన్లతో పాటు పల్లెపల్లెల్లో సచివాలయాలు, ఆర్బీకేలు లాంటి ఎన్నో సేవలను అందిస్తున్నారు. పాలనా యంత్రాంగం ప్రజల చెంతనే ఉంటూ మెరుగైన సేవలందిస్తూ ప్రజలు హర్షించేలా ముందుకు సాగుతుంది.

భూ సమస్యలు పరిష్కారం

ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో నూతన ఆర్డీఓ కార్యాలయం ఏర్పడడం వలన త్వరలోనే భూసమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల ప్రజలకు వ్యయప్రయాసలు తగ్గడంతో పాటు మెరుగైన సేవలు అందుబాటులోకి వచ్చాయి. డివిజన్‌లోని



ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయం

ఆత్మకూరు, కొత్తపల్లి , పాములపాడు, జూపాడుబంగ్లా , నందికొట్కూరు, పగిడ్యాల, మిడుతూరు మండలాల్లో భూసమస్యలు అధికంగా ఉన్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో అధికారులకు పని భారం ఎక్కువ కావడంతో ఇవి సకాలంలో పరిష్కారానికి నోచుకోలేకపోయాయి. ఎన్నో ఏళ్లగా ముంపునకు గురైన భూములు, డి- పట్టాలు, దేవాలయ భూములు లాంటి ఎన్నో సమస్యలతో ఈ ప్రాంత రైతులు ఇబ్బందులు పడ్డారు. ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటు చేయడంతో ఏడాదిలో దాదాపు 60 మంది రైతుల భూసమస్యలు పరిష్కరించారు. ఇవే కాకుండా ఇంటి స్థలాలు, రేషన్‌కార్డులు, పింఛన్లు, ఆస్తి తగాదా లాంటి సమస్యలపై స్పందనలో ఫిర్యాదులు అందడంతో ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది వాటి సత్వర పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు.

మరింత వేగవంతంగా భూ రీ సర్వేలు

డివిజన్ ఏర్పాటుతో భూ రీ సర్వేలు వేగవంతంగా సాగుతున్నాయి. ఇప్పటికే నందికొట్కూరు మండలంలోని కొడిగాల, జూపాడుబంగ్లా మండలంలోని లింగాపురం, ఆత్మకూరు మండలంలోని శ్రీపతిరావుపేట గ్రామాల్లో రీ భూసర్వే చేసి భూహక్కుల పత్రాలను కూడా అందించారు. ఆత్మకూరు మండలంలో 23 ఎకరాలకు సంబంధించి ఎస్సీ కార్పొరేషన్ మంజూరు చేసిన ఈ భూములు వివాదంగా ఉండడంతో ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది సమస్యను పరిష్కరించి ఆ భూములు రైతులకు పంపిణీ చేశారు.

దూర భారం తగ్గింది



ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయం ఉండడం వలన కర్నూలుకు వెళ్లాల్సిన పనిలేకుండా పోయింది. దీంతో 70 కిమీ దూరం తగ్గింది. ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి సమస్యలు పరిష్కరించుకుంటున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

–బాషా, ఆత్మకూరు

భూసమస్యలు వేగవంతంగా పరిష్కరిస్తున్నాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సుపరిపాలనలో భాగంగా నూతన జిల్లాలు, ఆర్డీఓ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. ఆత్మకూరులో రెవెన్యూ డివిజన్ ఏర్పడ్డాక తొలి ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టి ఇప్పటికి ఏడాది పూర్తయ్యింది. రైతులకు సంబంధించిన సమస్యలు పరిష్కరిస్తున్నాం. డివిజన్‌లోని 3 ప్రాంతాల్లో భూములు రీ సర్వేలు చేసి గట్లకు రాళ్లు వేశాం. ఎలాంటి వివాదం లేకుండా రైతులకు భూములను అందిస్తూ పాస్‌పుస్తకాలు అందిస్తున్నాం. ఈ ప్రాంత రైతుల సమస్యలు పరిష్కరిస్తున్నాం. వచ్చే రోజుల్లో మరిన్ని రైతుల సమస్యలు పరిష్కరిస్తాం.

– ఎస్ దాస్, ఆర్డీఓ

సమస్యలను నేరుగా ఆర్డీఓకు వివరిస్తున్నాం



ఆత్మకూరులో ఆర్డీఓ కార్యాలయం ఉండడం వలన నేరుగా భూసమస్యలు, ఇతర సమస్యలు ఆర్డీఓకు తెలుపుకుంటున్నాం. గతంలో ఏ సమస్య వచ్చినా సుదూరంగా ఉన్న కర్నూలుకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ఇక్కడే సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతున్నాయి.

– వెంకటేశ్వర్లు, బాపనంతపురం

కర్నూలు వెళ్లి పింఛన్ పంపిణీ



కర్నూలులో చికిత్స పొందుతున్న భవానీ బాయికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ అల్లాబకాష్

ఆత్మకూరు: పట్టణంలో వలంటీర్‌గా పని చేస్తున్న షేక్ కలిముల్లా, అల్లాబకాష్‌లు కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న కిడ్నీ బాధితులైన తండ్రి, కూతుళ్లకు గురువారం పింఛన్ పంపిణీ చేసి తమ నిబద్ధతను చాటుకున్నారు. పట్టణానికి చెందిన రాజా సింగ్, భవానీ బాయి కిడ్నీ వ్యాధితో బాధపడుతూ కర్నూలులో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వలంటీర్లు కర్నూలుకు వెళ్లి రాజా సింగ్‌కు , భవానీబాయికి నగదు అందజేశారు. ఈ సందర్భంగా వారు సీఎం జగనన్నకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా వలంటీర్లను పలువురు పట్టణ ప్రజలు అభినందించారు.

మహిళా పక్షపాతి సీఎం వైఎస్ జగన్

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ
- సీఎం జగనన్న చిత్ర పటానికి పాలాభిషేకం



నందికొట్కూరులో పొదుపు మహిళలకు మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతిగా నిలిచారని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని చాముండి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన మూడో విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నందికొట్కూరు నియోజకవర్గంలో 4,072 గ్రూపుల సభ్యులకు రూ. 27.29 కోట్లు వైఎస్సార్ ఆసరా పథకం కింద జగనన్న ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే ఇచ్చిన హామీలను 90 శాతం వరకూ అమలు చేసి చరిత్ర సృష్టించారని గుర్తు చేశారు. దేశంలో ఎక్కడ లేని విధంగా చెప్పకుండానే 40 శాతం వరకూ ఇవ్వని హామీలను అమలు చేసి ప్రజల గుండెల్లో నిలిచిపోయారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ షకూర్, తహసీల్దార్ రాజశేఖర్ బాబు, ఎంపీడీఓ శోభారాణి, సర్పంచులు సుశీలమ్మ, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు మార్తమ్మ, సహకార సొసైటీ అధ్యక్షులు హుసేనయ్య, హరిసర్వోత్తమరెడ్డి, కౌన్సిలరు ధర్మారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, చిన్న నాగన్న, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

అక్కాచెల్లెమ్మలకు ఆర్థిక భరోసా ఆసరా

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ ఆసరా పథకం అక్కాచెల్లెమ్మలకు ఆర్థిక భరోసా నిస్తుందని, పొదుపు మహిళలు ఆసరా నిధులను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాయలం ఆవరణలో వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చెంచు మహిళా సమాఖ్య కమ్యూనిటీ కో–ఆర్డీనేటర్ తయారు చేసి వైఎస్సార్ ఆసరా నమూనాను ఎమ్మెల్యే పరిశీలించారు. అధికారులు, నాయకులతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 532 స్వయం సహాయ సంఘాల మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మూడో విడత ఆసరా కింద రూ.3,32,18,191 నిధులు మంజూరు చేశారన్నారు. అనంతరం మహిళలతో కలసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ పేదలకు వరం

రాష్ట్ర ప్రభుత్వం పేదప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు తెచ్చిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం పేదప్రజలకు వరమని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట వైద్యులు వినోద్‌కుమార్, దీపా నాగవేణీ, వైద్య, ఆరోగ్య సిబ్బందిలతోలకసి 104 వాహనాన్ని రిబ్బన్ కట్‌చేసి, జేండా ఊపీ ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, ల్యాబ్‌ను, మందుల స్టాక్ రూమ్‌ను, సిబ్బంది పనితీరును, పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మేరి, తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, శాలివాహన కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సుగురు రవణమ్మ, సర్పంచులు విజయ్ కుమార్, కె.మారెన్న, చంద్రశేఖర్ యాదవ్, వైఎస్సార్ సీపీ నాయకులు జీఎండీ రఫీ, శ్రీనాథరెడ్డి, సాయిరాం , మద్దిలేటి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తపల్లిలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మల్లన్న సన్నిధిలో ప్రెస్ అకాడమీ చైర్మన్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను గురువారం ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు దంపతులు దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఆలయాధికారులు, అర్చకులు ఆలయమర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా దర్శించుకున్నారు. స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేకపూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చకవేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు స్వామివార్లశేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు అందజేసి, సత్కరించారు.

సున్నిపెంట ఐటీడీఏను సందర్శన

శ్రీశైలం: రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు గురువారం ఉదయం స్వామిఅమ్మవార్లను దర్శించుకున్న అనంతరం సున్నిపెంటలో ఉన్న ఐటీడీఏ (పీటీజీ చెంచు)కార్యాలయాన్ని సందర్శించారు. క్షేత్ర స్థాయి అధికారులతో సమావేశమయ్యారు. ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి శ్రీశైలం ఐటీడీఏ పరిధిలో ఉన్న చెంచుగూడేలలో నివసిస్తున్న చెంచుల జీవనశైలి, ప్రభుత్వం ద్వారా వారికి అందుతున్న పథకాలను పవర్‌పాయింట్ ద్వారా వివరించారు. సమావేశంలో ఏపీఓ మురళీధర్, లతారెడ్డి, ప్రెస్ అకాడమీ ఎగ్జిక్యూటీవ్ సెక్రటరీ బాలగంగాధర్‌తిలక్ తదితరులు పాల్గొన్నారు.



కొమ్మినేని శ్రీనివాసరావుకు ఆహ్వానం పలుకుతున్న దేవస్థాన అధికారులు

మహానందీశ్వరుడి సన్నిధిలో..

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో ఎస్‌కే యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ రామకృష్ణారెడ్డి గురువారం పూజలు నిర్వహించారు. వారు శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామివార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. పూజల అనంతరం స్థానిక అలంకార మండపంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ హరినాథ్ ఆయనకు స్వామిఅమ్మవార్ల ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేయించారు. ఆయన వెంట డాక్టర్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. అలాగే రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన రాజస్థానీయుల గురువు బోమా రామ్‌జీ బాబా మహానందికి వచ్చారు. లోకంలో అందరూ బాగుండాలని మహానందీశ్వరస్వామిని వేడుకున్నట్లు చెప్పారు.

ఉపవాసం శక్తివంతమైనది

నందికొట్కూరు: రంజాన్ మాసంలో 30 రోజుల పాటు ముస్లిం సోదరులు ఉపవాసం ఉండటం ఎంతో గొప్ప విషయమని వైఎస్సార్‌సీపీ నాయకుడు బైరెడ్డి మల్లికార్జునరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని నూరాని మసీదులో ముస్లింల ఉపవాస ప్రార్థనలో పాల్గొన్నారు. ఆయన వెంట మత పెద్దలు షేక్ ఇమామ్, అబ్దుల్ రహిమాన్, మైనార్టీ నాయకులు అబుబక్కర్, వజీర్‌బాషా, మన్సూర్, కౌన్సిలర్లు హమీద్, చాంద్‌బాషా, నాయబ్, రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రార్థన చేస్తున్న, బైరెడ్డి మల్లికార్జున రెడ్డి

మద్దతిచ్చిన వారి ఇంటి గడపకే స్టిక్కర్

వెలుగోడు: జగనన్నే మా నమ్మకం అంటూ ఆయన పాలన పట్ల పూర్తి విశ్వసనీయత చూపి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతు తెలిపిన కుటుంబానికి అభ్యంతరం లేకపోతే ఒక స్టిక్కర్‌ను అందజేస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి, జేసీఎస్ మండల కన్వీనర్ దేశం తిరుపంరెడ్డి తెలిపారు. గురువారం వేల్పనూరు గ్రామంలో జగనన్నే మా నమ్మకం కార్యక్రమంపై గృహ సారథులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు బన్నూరు తోయ జనాభారెడ్డి, పల్లె వెంకట్రామిరెడ్డి, నాయకులు బన్నూరు అంకిరెడ్డి, బన్నూరు రాఘవ రెడ్డి, పోతం గోపాల్‌రెడ్డి, పల్లె హరినాథ్‌రెడ్డి, చెరుకుచెర్ల అంకిరెడ్డి పాల్గొన్నారు.

నేడు 'జగనన్నే మా భవిష్యత్'

శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి శుక్రవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని వెలుగు కార్యాలయంలో ఉదయం 9 గంటలకు కార్యక్రమం ఉంటుందన్నారు. సచివాలయ పరిధిలోని వలంటీర్లు, గృహసారథులు, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



కిట్లు అందజేస్తున్న తిరుపంరెడ్డి

పన్నుపై 5 శాతం రాయితీ

ఆత్మకూరు: మున్సిపాలిటీ పరిధిలో ఈ ఏడాది ఇంటి పన్ను, వివిధ రకాల పన్నులు చెల్లించని వినియోగదారులు ఈ నెల చివరి నాటికి చెల్లిస్తే 5 శాతం రాయితీ అందిస్తామని మునిస్పల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ 2023–24 సంవత్సరానికి సంబంధించిన ప్రాపర్టీ ట్యాక్స్‌లు పూర్తిగా చెల్లిస్తే ఈ రాయితీ వర్తిస్తుందన్నారు.

గుండెపోటుతో వీఆర్వో మృతి

కొత్తపల్లి: మండలంలోని నందికుంట గ్రామ వీఆర్వోగా పని చేస్తున్న చిన్నవెంకటయ్య (54) గుండెపోటుతో మృతి చెందాడు. చిన్న వెంకటయ్య గురువారం తెల్లవారుజామున శాతనకోట గ్రామంలోని తన ఇంట్లో గుండెపోటుకు గురై తీవ్ర అస్వస్థతకు లోనుకాగా గమనించిన కుటుంబ సభ్యులు నందికొట్కూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

రేపు 'రన్ ఫర్ జీసస్'

ఆత్మకూరు: పట్టణంలో ఈ నెల 8న నిర్వహిస్తున్న రన్ ఫర్‌జీసస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు శీలం శేషు, కన్వీనర్ ప్రభాకర్ తెలిపారు. ఏసుక్రీస్తు పునరుద్ధానాన్ని లోకానికి చాటి చెప్పే విధంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రజలందరు శాంతి కలిగి ఉండాలని చెప్పారు.

చెంచుకాలనీలో అధికారుల పర్యటన

పగిడ్యాల: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం తహసీల్దార్ భారతి, ఎంపీడీఓ వెంకటరమణ, ఈఓఆర్డీ పుల్లయ్య స్థానిక చెంచు కాలనీని సందర్శించి వారి సమస్యలపై ఆరా తీశారు. ఇళ్ల పై కప్పు స్లాబ్‌లు దెబ్బతినడం వలన అధిక వర్షాలకు పొటుకు తీసుకుంటాయని చెంచులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. తాగునీటి సదుపాయం, డ్రైనేజీ కాలువలు, రేషన్‌కార్డులు ఇతర సౌకర్యాలు బాగానే ఉన్నాయని వివరించారు.

ఇతర కులాలను చేర్చొద్దు

ఆత్మకూరు: ఎస్టీ జాబితాలో ఇతర కులాలను చేర్చవద్దని, జీఓ నెంబర్ 52ను రద్దు చేయాలని ఆల్‌ఇండియా బంజారా సేవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ నాయక్ డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో గురువారం ఆల్ ఇండియా బంజారా సేవ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ నెల 9న వెంకయ్యపల్లి గుడి ప్రాంగణంలోని శ్రీనివాసగార్డెన్‌లో సమావేశం నిర్వహిస్తున్నామని చెప్పారు.

విజేత ఎస్. కొత్తూరు వృషభాలు

కొత్తపల్లి: మండలంలోని జీ.వీరాపురం గ్రామంలో వెలసిన శ్రీ సుంకుల పరమేశ్వరి దేవి జయంతి సందర్భంగా గురువారం గ్రామపెద్దల సమక్షంలో ఆరుపళ్ల వృషభాలకు బండలాగుడు పోటీలను నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్ రెడ్డి పోటీలను ప్రారంభించారు. పోటీల్లో నంద్యాల జిల్లా ఎస్. కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర రెడ్డికి చెందిన బీరం బుల్స్ మొదటి బహుమతి రూ.30వేలు, సోయయాజులపల్లె నరసయ్య ఎద్దులు రెండో బహుమతి రూ.25వేలు, ప్రాకాశం జిల్లా బాలగంగులు, పుసులూరు, నంద్యాల జిల్లా నితిష్‌ల ఎద్దుల ఉమ్మడిగా మూడో బహుమతి రూ.20 వేలు గెలుపొందాయి. అదేవిధంగా పాములపాడు మండలం తుమ్మలూరు గ్రామానికి చెందిన పల్లవి వృషభాలు నాల్గో బహుమతి రూ.15వేలు, ఆత్మకూరు మండలం పెద్ద అనంతపురం గ్రామానికి చెందిన జయమ్మ ఎద్దులు ఐదో బహుమతి రూ.10వేలు, పాములపాడుకు చెందిన ప్రసాద్ వృషభాలు ఆరో బహుమతి రూ.5వేలు గెలుచుకున్నాయి.

'ఫ్యామిలీ డాక్టర్' దేశానికే రోల్ మోడల్

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- వెలుగోడులో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ప్రారంభం

వెలుగోడు: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానం దేశానికే రోల్ మోడల్ అని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. పట్టణంలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాలలో సీఎం వైఎస్ జగన్ ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. గత ప్రభుత్వంలో మాదిరిగా వైద్యం కోసం డాక్టర్ల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా మీ ఊరిలోనే మీ వద్దనే ఉచిత వైద్యం అందించేలా దేశంలో ఎక్కడా లేని విధంగా ఫ్యామిలీ విధానాన్ని తీసుకువచ్చారన్నారు. ఫ్యామిలీ డాక్టర్లు సాధారణ వైద్య సేవలు, ప్రసూతి ఆరోగ్య సంరక్షణ సేవలు, బాలింతల ఆరోగ్య సంరక్షణ సేవలు, రక్తహీనత పరీక్షలు, చికిత్స, అసంక్రమిత వ్యాధులకు ఆరోగ్య పరీక్షలు, చికిత్స, పాఠశాలలో వైద్య పరీక్షలు తదితర సేవలందిస్తారన్నారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా 104 వాహనాన్ని ప్రారంభించి అందులో సమకుర్చిన ఆధునిక వైద్య పరికరాలను, మందులను పరిశీలించారు.

మసీద్ పనుల పరిశీలన

పట్టణంలో పునర్ నిర్మిస్తున్న మర్కజ్ మసీదును శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే శిల్ప చక్రపాణి రెడ్డి సందర్శించి, పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు.



ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను ప్రారంభించి బీపీ పరీక్ష చేయించుకుంటున్న ఎమ్మెల్యే శిల్పా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రూ.3.65 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే అందజేశారు.

వైద్యానికి సాయం

పట్టణంలోని మదర్ ఖాన్ వీధిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మాలిక్ ఖాన్ బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతున్నారు. ఆయనను ఎమ్మెల్యే పరామర్శించి, అతని చికిత్సకు సంబంధించి ఎల్‌ఓసీ ద్వారా లక్ష యాభై వేల రూపాయల సాయం అందించారు.

సొంత నిధులతో ముస్లింల శ్మశాన వాటిక అభివృద్ధి


పట్టణంలోని రొఖియాబీ దర్గా వెనుక ఉన్న ముస్లింల శ్మశాన వాటిక ఇరువైపుల ఉన్న సీసీ రోడ్డు ఎత్తుగా ఉండడంతో వర్షపు నీరు చేరి గుంతలు ఏర్పడి సమాధులు తీసుకొనుటకు తీవ్ర ఇబ్బందిగా ఉండేది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి దృష్టికి ముస్లింలు తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే.. తన సొంత నిధులతో అభివృద్ధి చేయిస్తానని హామీ ఇచ్చారు. టిప్పర్లను పెట్టి మట్టిని తొలించే పనులు చేపట్టారు. దీంతో స్థానిక ముస్లిం మైనారిటీలు ఎమ్మెల్యేకు కతజ్ఞతలు తెలిపారు . ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ వేల్పుల జయపాల్, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, ఎంపీడీఓ షేక్ అమానుల్లా, వైద్యాధికారిణి ప్రసన్న లక్ష్మి, పార్టీ నాయకులు దేశం తిరుపం రెడ్డి, జిల్లా కో–ఆప్షన్ మెంబర్ సయ్యద్ సులేమాన్, కే రామ్మోహన్ రెడ్డి, ఎంపీటీసీ చాంద్ బాషా, తెలుగు రమణ, గోవిందు, ఖాదర్ వలీ, మదీనా షంషీర్ అలీ తదితరులు పాల్గొన్నారు .

'జగనన్నే మా నమ్మకం' విజయవంతం చేస్తాం

ఆత్మకూరు: పట్టణంలోని అన్ని వార్డులు, సచివాలయ పరిధిల్లో ఈ నెల 7వ తేదీ నుంచి జగనన్నే మా నమ్మకం కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, ఏసీఎస్ ఇన్‌చార్జ్ సుల్తాన్ అన్నారు. పట్టణంలోని గ్రామసచివాలయ పరిధిలో గురువారం జరిగిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. జగనన్నే మా నమ్మకం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని అన్ని కాలనీల్లో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తామని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేసిన సంక్షేమ పథకాలు వివరిస్తామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని, స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని అధిక మెజారిటీతో గెలిపించి ఆదరించేలా ప్రజలపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. అనంతరం గృహసారథులకు కిట్లను పంపిణీ చేశారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

జూపాడుబంగ్లా: రైతన్నల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు డాక్టర్ మల్లికార్జునరెడ్డి, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం తర్తూరు జాతరలో అంతర్‌రాష్ట్రస్థాయి సీనియర్స్ విభాగం ఎద్దుల బండలాగుడు పోటీలను ప్రారంభించారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లా, నాదర్‌గుల్‌కు చెందిన వై ప్రసన్నకుమార్ వృషభాలు విజయఢంగా మోగించి రూ.లక్ష నగదును గెలుపొందాయి. డోన్ మండలం, కొత్తకోటకు చెందిన గుర్నాథ్ ఎద్దులు రెండోస్థానంలో రూ.80వేలు, నంద్యాల మండలం, బిల్లల్లాపురం భూమాగోవర్ధన్‌రెడ్డి ఎద్దులు తృతీయస్థానంలో రూ.60వేలు దక్కించుకున్నాయి. కోడుమూరు మండలం, వల్కూరుకు చెందిన తిరుమలేష్ ఎద్దులు నాల్గొ స్థానంలో నిలిచి రూ.40 వేలు, వైఎస్సార్ జిల్లా, బాలుగారిపల్లెకు చెందిన రమణారెడ్డి వృషభాలు ఐదొ స్థానంలో రూ.20వేలు, గోస్పాడు మండలం, జిల్లెలకు చెందిన గౌటికె నాగిరెడ్డి ఎద్దులు ఆరో స్థానంలో నిలిచి రూ.10వేలు దక్కించుకున్నాయి. వృషభాల యజమానులకు యశ్వంత్ రెడ్డి, బీకే.సింగ్, బాలాపూర్ రంగారెడ్డి, మనోహరప్ప తదితరుల సహకారంతో బహుమతులు అందజేశారు. సర్పంచ్ పీఎం నాగిరెడ్డి, జెడ్పీటీసీలు జగదీశ్వరరెడ్డి, యుగంధర్‌రెడ్డి, లింగాపురం సర్పంచ్ నాగార్జునరెడ్డి, మాజీ జడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి పాల్గొన్నారు.



విజేతలైన ఎద్దుల యజమానిని సన్మానిస్తున్న డాక్టర్ మల్లికార్జున, మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి